క్లుప్తంగా

పడకేసిన పారిశుద్ధ్యం


పూడిపోయిన మురుగు కాలువ

కల్లూరు : మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలో వీధులలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం పేరుకుపోయింది. డ్రైనేజీ కాలువలు సరిగా లేకపోవడంతో మురుగు నీరు, మట్టితో నిండాయి. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యం లోపించడం వల్ల దోమలు, ఈగలు, లార్వాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యఅయ పనులు నిర్వహించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

13న ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో బహిరంగ వేలం

కర్నూలు (టౌన్): కర్నూలులోని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపోలో ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వి.శ్రీధర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌బీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు డిపోలో ఉన్న 93 ఫ్రీజర్స్, 96 బ్యాటరీ ఇన్వర్టర్స్, 96 క్యాష్ చెస్ట్, 192 స్కానర్లు, 96 క్యాష్ కౌంటింగ్ మిషన్లను బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల పాటదారులు రూ.5 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. డిపాజిట్ చెల్లించినవారికి వేలం రోజున ఉదయం 9 గంటలకు ఎంట్రీ పాసులు ఇస్తారని, పాసులు లేనివారికి లోపలికి అనుమతి ఉండదని తెలిపారు. ఇతర వివరాలకు డిపో మేనేజర్ 99493 51039 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలపై శిక్షణ

కర్నూలు సిటీ: కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. నగర శివారులోని ఓ బీఈడీ కాలేజీలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ అమ్మి నాయుడు ప్రారంభించి ప్రసంగించారు. మండలంలోని స్కూళ్లకు సంబంధించిన అంశాలన్నింటిపై ఎంఈఓలకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల అభివృద్ధికి స్కూల్ హెచ్‌ఎంలు పాటుపడాలని, ఆయా స్కూళ్లలో ఉన్న టీచర్లతో పాటు, స్థానికులతో కలిసి స్కూల్ అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూ అందరి సహకారంతో సర్వతోముఖాభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంఓ రఫీక్, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): చిల్డ్రన్స్ డే పురస్కరించుకొని ఈ నెల 13, 14 తేదీల్లో నగర శివారులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మైదానంలో అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న అండర్-12, అండర్-15 విభాగంలో చెస్ పోటీలు, అలాగే బాలుర విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 14న బాలుర త్రోబాల్, బాలికల వాలీబాల్, బాల బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు, అలాగే రైఫిల్ షూటింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు రాజ్‌విహార్ నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, పూర్తి వివరాలకు 93938 27585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మార్కెట్ యార్డులో దళారులను నియంత్రించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో దళారులను నివారించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడును ఏపీ రైతు సంఘం నాయకులు కలిసి ఉల్లికి మద్దతు ధరను కల్పించాలని కోరారు. ఇక్కడి వ్యాపారులు, ట్రేడర్లు ఏకమై రైతులను ముంచుతున్నారని ఆరోపించారు. అలాగే మార్కెట్ యార్డులో కనీస వసతులను కల్పించాలని, తాగునీటిని ఏర్పాటు చేయాలని, భోజన వసతి కల్పించాలని కోరారు. మరో వైపు హంద్రీ నీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలని సీపీఎం రాష్ట్ర నాయకులు కె.ప్రభాకరరెడ్డి, రాంభూపాల్, డి.గౌస్‌దేశాయ్ మంత్రికి విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలి

కర్నూలు జిల్లాలో నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లాకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం సమర్పించారు.

కళ తప్పిన సచివాలయాలు

- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వ కుట్ర
- ఉద్యోగులను పింఛన్ల పంపిణీకే పరిమితం చేసిన వైనం
- ప్రభుత్వ సేవలందక గ్రామీణుల అవస్థలు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు


గని సచివాలయం


గతంలో గడివేముల సచివాలయంలో ఆధార్ సేవలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

గడివేముల : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు సులభతరంగా అందించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాలను ప్రారంభించారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే గాంధీ జయంతి రోజున ప్రతి 2 వేల జనాభా కలిగిన గ్రామానికి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రజలు, రైతులకు మెరుగైన సేవలు అందించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తోంది. సచివాలయ ఉద్యోగులను కేవలం పింఛన్లకే పరిమితం చేస్తూ గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడుస్తోంది.

ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు

మండలంలో 14 సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు దాకా పనిచేసే విధంగా గత ప్రభుత్వం నియమించింది. ప్రతి సచివాలయంలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శితో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, సర్వేయర్లు, వీఆర్వోలు అందుబాటులో ఉంటారు. ప్రతి సచివాలయంలో 545 సర్వీసులకు పైగా ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు సకాలంలో అందించి ఉద్యోగులు మన్ననలు పొందారు. గత ప్రభుత్వం హయాంలో అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం ఇంటికి వద్దకే అందజేసేవారు. ఏపనైనా అర్హత ఉంటే పార్టీలతో సంబంధం లేకుండానే మంజూరు చేశారు. దీంతో దళారీ వ్యవస్థ లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకు గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ లేకుండా చేసింది. సచివాలయ వ్యవస్థను కూడా నీరుగార్చేలా చేస్తోంది. సచివాలయ ఉద్యోగులను కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం చేసి వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలైనా రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు ఇంతవరకు తెరుచుకోలేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినేలా..

కూటమి నేతలు ప్రతిపక్షలలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగుల పట్ల వివక్షతో అనేక విమర్శలు చేశారు. అవమానంగా మాట్లాడారు. నేడు కూటమి సర్కార్ పింఛన్లు పంపిణీకి సచివాలయ ఉద్యోగులే పెద్దదిక్కయ్యారు, ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన ।ఇది మంచి ప్రభుత్వం౯ కార్యక్రమంలో స్టిక్కర్లు అతికించే దగ్గర నుంచి ఇంటింటి ప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. గతంలో ఒకటో తేదీన వలంటీర్లు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వారిని పక్కనపెట్టి సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయిస్తోంది. వీరు ఒకటో తేదీన 95 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పడం వెనుక సచివాలయ ఉద్యోగుల పాత్ర ఎంత కీలకం అనేది జగమెరిగిన సత్యం.

నేడు విలవిల

గత ప్రభుత్వం రెండు వేల జనాభా ఉన్న గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో హెల్త్ ।సెంటర్ ఏర్పాటు చేసింది. కొన్ని నెలల క్రితం వరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు, లబ్ధిదారుల రాకపోకలతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. నేటికీ ప్రభుత్వ వెబ్‌సైట్లు తెరుచుకోకపోవడంతో నూతన పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీకార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవడానికి అర్హత ఉన్న లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గ్రామాల్లోని సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో వెళ్తున్నారు. నూతన పింఛన్ల కోసం ప్రభుత్వ వెబసైట్ తెరవకపోవడంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సేవలందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు సచివాలయ ఉద్యోగులు పని లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి.

ప్రజలకు అనుగుణంగా సేవలు అందించేవారు



మా గ్రామంలో మారుమూల కొండ ప్రాంతంలో ఉండేది. మండల కేంద్రానికి రావాలంటే దాదాపు 15 కిలోమీటర్లు వచ్చి పనులు చేసుకోవాల్సి పరిస్థితి ఉంది. గత జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించేందుకు సచివాలయ, వలంటీరు వ్యవస్థ ఎంతాగానో ఉపయోగపడేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హత ఉన్నప్పటికి ప్రజలు కార్యాలయాల చుట్టూతిరిగినా ఫలితం లేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్న ఇంత వరకు కొత్త రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, పింఛన్‌ల దరఖాస్తు కొరకు వెబ్‌సైట్లు ఓపెన్ కాలేదు.

– కాలునాయక్, వైస్ ఎంపీపీ, ఎల్‌కే తండా

మారని అధికారుల తీరు


పీజీఆర్‌ఎస్‌కు కేవలం ఇద్దరు అధికారులే హాజరైన దృశ్యం

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి హాజరుకావడంపై మండల అధికారుల నిర్లక్ష్య ధోరణి కొనసాగుతూనే ఉంది. మండల అధికారులు ప్రజా సమస్యలను తెలుసుకోవడం, వాటిని పరిష్కరించడంపై ఆసక్తి కనరపడం లేదని మండల ప్రజలు ప్రతి వారం మండిపడుతున్నా, అధికారులు తీరు మాత్రం మారడం లేదు. సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి కేసు విధులలో భాగంగా కోర్టుకు వెళ్లగా, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పురుషోత్తం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. అయితే పలువురు మండల అధికారులు కార్యక్రమంపై నిర్లక్ష్యంతో గైర్హాజరయ్యారు. కేవలం ఇద్దరు అధికారులు మాత్రమే (డీటీ, ఉపాధిహామీ ఏపీఓ రామన్న) నిర్ణీత సమయానికి కార్యక్రమానికి హాజరయ్యారు. 11 గంటల అనంతరం ఏఓ మల్లేష్‌కుమార్, వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, హౌసింగ్ ఏఈ సుమంత్‌లు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. 11:15 గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి వచ్చి.. వెంటనే వెనుదిరిగారు. కాగా ఎంపీడీఓ రాణెమ్మ మాత్రం తన కార్యాలయంలోనే ఒక్కరే కార్యక్రమానికి హాజరైనట్లు డీటీ తెలిపారు. కార్యక్రమానికి వైద్య అధికారులు, ఎంఈఓలు, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పీఆర్, ఇరిగేషన్ ఏఈలు, పశువైద్యులు ఎలాంటి సమాచారం లేకుండా పీజీఆర్‌ఎస్ కార్యక్రమంతో పాటు తమ విధులకు కూడా హాజరు కాలేదు.

కూలీల హాజరు శాతం పెంచాలి


మాట్లాడూతున్న ఎంపీడీఓ రఘునాథ్

కర్నూలు (రూరల్) : ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు పెంచాలని ఎంపీడీఓ రఘునాథ్ ఆదేశించారు. నగరంలోని కర్నూలు మండల ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఏపీఓ మధుబాబు, టెక్నికల్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు మండలంలో తక్కువగా వుందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూలీల శాతం పెంచుకోవడానికి ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది గ్రామాలలో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా అసక్తి ఉన్న రైతులను గుర్తించి పండ్ల తోటల పెంపకంపై అవగహన కల్పించి, ఆ పథకానికి ప్రభుత్వం ఎంతమేర ప్రోత్సాహం అందజేస్తుందో రైతులకు తెలియపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ అనురాధ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ మండల ఏపీఓ మధుబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామాల పంచాయితీ సెక్రటరీలు పాల్గొన్నారు.

హంద్రీలో ఇసుక తవ్వకాలను ఆపాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచు భాగ్యరత్న

కోడుమూరు రూరల్: కోడుమూరు వద్ద హంద్రీనదిలో కొనసాగుతున్న ఇసుక తవ్వకాలను ఆపాలంటూ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు భాగ్యరత్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు సోమవారం విన్నవించారు. సర్పంచు మాట్లాడుతూ హంద్రీనది నుంచి కోడుమూరు పట్టణానికి మంచినీటిని అందించేందుకు మేజర్ గ్రామ పంచాయతీ బోరు పాయింట్లను ఏర్పాటు చేసిందన్నారు. అయితే ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయడంతో ఇసుక వ్యాపారులు మంచినీటి బోర్ల సమీపంలో యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టి ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీనివల్ల హంద్రీలో నీటి నిల్వలు తగ్గిపోతుండడంతో పట్టణంలో తీవ్ర నీటి సమస్య తరచూ తలెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బోర్లకు సమీపంలో ఇసుక తవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ హంద్రీ నుంచి ఇసుకను తీసుకునేందుకు పంచాయతీ కార్యదర్శి అనుమతి ఉండేలా చర్యలు తీసుకుంటానని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

టైర్ల దుకాణంలో చోరీ

కర్నూలు (టౌన్): నగరంలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ ప్రక్కన బీఎస్‌టీఆర్ టైర్ల దుకాణంలో చోరీ జరిగింది. ఆదివారం సెలవు కావడంతో షాపు మూసి ఉంది. దొంగలు షాపు వెనుకవైపు నుంచి దుకాణం పైకి ఎక్కి సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. ప్రహరీ ద్వారా లోపలికి వెళ్లి గేట్ల తాళాలు పగులగొట్టారు. లోపల ఉన్న క్యాష్ కౌంటర్ తెరిచే ప్రయత్నం చేసినా రాలేదు. దీంతో 3 ఇన్వర్టర్ బ్యాటరీలు ఎత్తుకుని ఉడాయించారు. ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లిన యజమాని రవికిషోర్ చోరీ జరిగినట్లు గుర్తించి నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యురేనియం తవ్వకాలను నిలిపివేయాలి


రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

కోడుమూరు రూరల్: కప్పట్రాళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన యురేనియం తవ్వకాలను వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం కోడుమూరులో రైతు సంఘం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కోసం పచ్చని పంట పొలాలను నాశనం చేయడానికి యత్నిస్తోందని, ఇందుకు నిదర్శనం కప్పట్రాళ్ల యురేనియం తవ్వకాలేనని విమర్శించారు. హంద్రీనీవా కాలువ నీటితో కరువు నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న పల్లెల్లో యురేనియం పేరుతో తవ్వకాలు చేస్తామని కేంద్రం తెలుపడం దారుణమన్నారు. యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలంతా కలిసికట్టుగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. తవ్వకాలను ఆపేంత వరకూ ప్రజలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మనోహర్, నాయకులు ఆంజనేయులు, మల్లయ్య, హనుమంతు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక శోభితం.. బుగ్గరామేశ్వరం

- భక్తిశ్రద్ధలతో కార్తీక మొదటి సోమవారం పూజలు
- స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు
- జ్యోతులు వెలిగించి మొక్కులు తీర్చుకున్న మహిళలు


కాల్వబుగ్గలో స్వాముల వారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం


భోగేశ్వరం ఆలయంలోని ప్రధాన కోనేరులో స్నానం ఆచరిస్తున్న భక్తులు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర క్షేత్రం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీక మొదటి సోమవారం కావడంతో ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు క్లై లక్ష్మీనారాయణ శర్మ, నరసింహాశర్మ బుగ్గరామేశ్వర స్వామి, భ్రమరాంబికాదేవికి సుప్రభాత సేవ, అభిషకాధి పూజలు నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలతో ప్రత్యేకం అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తిని పల్లకీలో ఆశీనులను గావించి గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలతో పల్లకీ సేవ చేపట్టారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తల్లితండ్రులు సుబ్రహ్మణ్యం, సుగుణమ్మ, గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, స్థానిక తహసీల్దార్ విద్యాసాగర్ ఆలయానికి చేరుకొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఈఓ మద్దిలేటి ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు మొత్తం 27 అభిషేకాలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నట్లు ఈఓ తెలిపారు. అలాగే హుసేనాపురం గ్రామానికి చెందిన భక్తుడు కాటినేని నారాయణ పుణ్య దంపతుల ఆర్థిక సౌజన్యంతో దేవస్థానంలో పుష్పాలంకరణ చేయించారు. కార్తీక మాసంలో శివపార్వతులను దర్శించుకోవడంతో సకల పాపాలు తొలగతాయనే విశ్వాసంతో మహిళలు ఉదయాన్నే కాల్వబుగ్గ క్షేత్రానికి అధిక సంఖ్యలో చేరుకొని స్థానిక పుష్కరిణుల్లో పవిత్ర స్నానమాచరించి, ఆలయం ఎదుట గల ధ్వజస్తంభం వద్ద ప్రమిదలలో జ్యోతులను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


కాల్వబుగ్గలో జ్యోతులను వెలిగిస్తున్న మహిళలు

భోగేశ్వరంలో కార్తీక సందడి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం భక్తులతో కళకళలాడింది. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో వందలాది మంది భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయ పరిధిలోని పంచ కోనేర్లలో స్నానం ఆచరించిన భక్తులు దీపాలను వెలిగించారు. అభిషేక ప్రియుడైన ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. కార్తీకమాసం, ఆలయ విశిష్టత గురించి ఆలయప్రధాన అర్చకులు శ్యాంసుందరశర్మ భక్తులకు వివరించారు. భోగేశ్వరున్ని దర్శించుకున్న భక్తులకు కాశీరెడ్డినాయన ఆశ్రమం, ఆర్యవైశ్య సత్రాలలో భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం గడిగరేవుల గ్రామంలో స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.


భోగేశ్వరంలో స్వామివారికి అభిషేకం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


బొల్తాపడిన తుఫాన్ వాహనం

పాణ్యం : మండల పరిధిలోని బలపనూరు మెట్ట వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హైవే పోలీసులు సోమవారం తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి 13 మంది తిరుపతికి వెళ్తుండగా బలపనూరు మెట్ట వద్ద రాగానే తుఫాన్ వాహనం స్టేరింగ్ కట్ కావడంతో అదుపు తప్పి బొల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు మరొకరికి గాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వాహనాన్ని బయటకు తీశారు.

నేడు పోలకల్లులో 'పొలం పిలుస్తోంది'

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ తెలిపారు. ఈ వారం కార్యక్రమ నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం గ్రామ రైతు సేవా కేంద్రం – 2లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేస్తామని, మధ్యాహ్నం క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతులతో కలిసి పంట పొలాలను సందర్శిస్తామన్నారు. పోలకల్ గ్రామ రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్మశాన వాటికలో సౌకర్యాలు కరువు

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని దిగువపాడు గ్రామంలో ఉన్న ఎస్సీ మాదిగ శ్మశాన వాటికలో సౌకర్యాలు కరువయ్యాయి. శ్మశాన వాటిక ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. గ్రామంలో ఉన్న దాదాపు 60 కుటుంబాల వారు ఈ శ్మశానంలో మృతదేహాలను ఖననం చేస్తారు. శ్మశానానికి మృతదేహాన్ని అంత్యక్రియలకు కొరకు తీసుకువచ్చినప్పుడు ముళ్లపొదలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలని, ముళ్ల పొదలనూ తొలగించాలని, అంత్యక్రియలలో పాల్గొనడానికి వచ్చిన వారికి నీటి అవసరాల కొరకు కుళాయి లేదా బోరింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ముళ్లపొదలతో నిండిన దిగువపాడు ఎస్సీ కాలనీ శ్మశానవాటిక

సౌకర్యాలు కల్పించాలి



దిగువపాడు గ్రామంలోని ఎస్సీ మాదిగ శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి. ముళ్లపొదలు తొలగించి, చుట్టూ ప్రహరీ నిర్మించాలి. అలాగే నీటి వసతి ఏర్పాటు చేయాలి. గతంలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.

– రెడ్డిపోగు విజయ్ కుమార్, దిగువపాడు